క్లుప్తంగా

అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్



ఖానాపురం : సమాజంలోని ప్రతీఒక్కరు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ రాజగోపాల్ కోరారు. మండలంలోని అశోక్‌నగర్‌లోని కేజీబీవీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా నంబర్, ఇతర వివరాలు ఇవ్వకూడదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే తెలియని లింకులను ఓపెన్ చేయొద్దని, తదితర సూచనలు చేశారు. బాలికలు ఏవైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్లు 100, 1930కు సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రఘుపతి, ప్రిన్సిపాల్ మేనక, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో వైద్యశిబిరం



గీసుకొండ : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న ఆరుగురు విద్యార్థుల రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.మధుసూదన్‌రెడ్డి, వార్డెన్ అర్జున్, సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎస్‌ఎం స్వరూప, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వృద్ధులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ సరోజ, సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ రాజు, సీహెచ్‌ఓ బాదావత్ భద్రయ్య, సిబ్బంది కంది కృష్ణారెడ్డి, ఈగ సత్యనారాయణ, వరంగంటి కుమారస్వామి, అడప సత్తయ్య, వరంగంటి మల్లేషం, పంచాయతీ కార్యదర్శి వికాస్, ఏఎస్‌ఎం పుష్ప, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గ్రీస్ ఎనర్జీలో ఉద్యోగ అవకాశాలు

నర్సంపేట రూరల్ : గ్రీస్ ఎనర్జీ సంస్థలో ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర పసాద్‌రెడ్డి, 1ఎం1బి గ్రీస్ ఫౌండేషన్ ముఖ్యవక్త అభిరామ్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో 1ఎం1బి గ్రీస్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఐటీ రంగంలో ఉద్యోగం పొందేలా శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణలో ప్రతిభ కబనర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ఏఓ సురేశ్, అకాడమీ కోఆర్డినేటర్ నారాయణ, ప్లేస్‌మెంట్ సెల్ హెడ్ ఫసీ అహ్మద్ ఫర్వేజ్, ఫణీంద్ర, రామకృష్ణ, రణదీర్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్య పనులుచేపట్టాలి

నల్లబెల్లి : పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి గోవింద రాజన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీజనల్ వ్యాదులు, పారిశుద్ధ్య, మంచినీటి సరఫరాపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గోవింద రాజన్ మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. జనవాసాల్లో బురద, గుంతలు లేకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఎంపీఓ రవి, డాక్టర్లు ఆచార్య, నవీన్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

గీసుకొండ : మండలంలోని శాయంపేట, వంచనగిరి గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య గురువారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన సీనియర్ సిటిజన్ కన్జర్వేషన్ సహకారంతో హన్మకొండ జిల్లా గోపాలపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాను పుస్తకాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికర్ బాబు, కారోబార్ కనకాచారి, కొండ మధు, రాజేశ్వర్‌రావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

వర్ధన్నపేట : తల్లి పాలు శిశువుకు అమత సమానమని ప్రాజెక్టు అధికారి డెబోరా అన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఇల్లందలో గురువారం ర్యాలీ నిర్వహించగా డెబోరా అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 7 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లి పాల విలువ, ముర్రుపాలు అందించడం, తదితరాలపై మహిళలకు అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. శిశువుకు పుట్టినప్పటి నుంచి ఆర్నెళ్ల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే అందించాలని చెప్పారు.

ఖానాపురం : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించగా డాక్టర్ జ్యోతి మాట్లాడారు. శిశువుకు పుట్టిన మొదటి గంటలోపు ఇచ్చే పాలు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తాయని తెలిపారు. ఆర్నెళ్ల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఇతర ఆహార పదార్థాలు అందిస్తే జీర్ణం కాక ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమ, హెల్త్ సూపర్‌వైజర్ దామోదర్‌రెడ్డి, ఏఎస్‌ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఖానాపురంలో..



చెన్నారావుపేట : అవగాహన కల్పిస్తున్న టీచర్

చెన్నారావుపేట : ఈర్య తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను అంగన్‌వాడీ టీచర్ మేడి సరోజన వివరించారు.

గుండం చెరువు తూముకు బుంగ



తూము నుంచి వృథాగా పోతున్న నీరు

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలోని గుండం చెరువు తూముకు బుంగ పడి సాగునీరు వృథా పోతోంది. మరమ్మతు చేయించడంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు, మండల ప్రజలు విమర్శిస్తున్నారు. చెరువు కింద 500 ఎకరాల ఆయకట్టు ఉండగా ఒకసారి నిండితే రెండు పంటలకు నీరు సరిపోతోంది. చెరువుకు రెండు తూములు, 3 బుర్ర తూములుండగా వీటిలో ప్రధాన తూముకు లీకేజీ ఏర్పడి బుంగగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి తూముకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



మండలంలో పెద్ద చెరువు, మండలంలోని చెరువులన్నీ నిండాక గుండం చెరువు నిండుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులోకి భారీగా నీరు చేరింది. ప్రధాన తూము నుండి లీకేజీ కారణంగా 4 మోటార్ల నీరు వృథాగా పోతుంది. లీకేజీ నీరు పొలాల పైనుండి పారడం వల్ల నాట్లు వేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తూముకు మరమ్మత్తులు చేసి సాగునీటి వృథాను అరికట్టాలి.

-తోటకూరి రాజు, రైతు

మాజీ మంత్రి సబితపై వ్యాఖ్యలు హేయం



వర్ధన్నపేట : రాస్తారోకో చేస్తున్న శ్రేణులు



రాయపర్తిలో..

వర్ధన్నపేట : చట్టసభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు హేయమని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం బైఠాయించి రాసారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు, కుమారస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మార్గం భిక్షపతి, ఎలేందర్‌రెడ్డి, తోటకూరి రాజమణి, అనిత, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, గుజ్జ గోపాల్‌రావు, కర్ర వెంకట్‌రెడ్డి, పెంచాల కుమారస్వామి, ఏరుకొండ వేణుగోపాల్, కొండేటి శ్రీను, తిరుపతి సురేష్, ఎల్లస్వామి, గోధుమల మధు, తోటకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నయీమ్, నాయకులు ఆకుల సురేందర్‌రావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కోదాటి దయాకర్‌రావు, భూక్య భద్రునాయక్, బొడ్డు రంగయ్య, దేదావత్ వెంకన్న, అశ్రఫ్‌పాషా, రాము, సింహాద్రి, శ్రీనివాస్, రాజు, ఎనగందుల యాదగిరి, చందు మల్లేష్, అఖిల్, ఉబ్బని మధు, మన్నన్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీటిని పారబోస్తున్న డాక్టర్ రవీందర్

నల్లబెల్లి : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులే అవకాశం ఉన్న క్రమంలో పల్లె దవాఖాన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి రవీందర్ కోరారు. మండలంలోని ముచ్చింపులను గురువారం ఆయన సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, తదితర వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని వైద్యసిబ్బందితో కలిసి పారబోయించారు. అనంతరం పల్లె దవాఖానను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న వైద్య శిబిరాలు, టీకాల పంపిణీ, కేసుల నమోదు వివరాలపై వైద్యురాలు నిఖిలతో చర్చించారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడమే ధర్మం



డాక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గీసుకొండ : ప్రభుత్వ ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడమే ఉద్యోగ ధర్మమని వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక పశు వైద్యుడు డాక్టర్ వడ్డేపల్లి రమేశ్ అన్నారు. ఆయనను బదిలీ అయిన సందర్భంగా మండలంలోని కోనాయిమాకులలో గురువారం నిర్వహించిన సభలో జీవాల పెంపకందారుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేశ్ మాట్లాడారు. తాను ఉద్యోగ ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించానని చెప్పారు. తనకు సహకరించిన నాయకులకు, పాడి రైతులకు, పశు పోషకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీవాల పెంపకందార్ల సంఘం నాయకులు దొంగల రాజు, పేర్ల రాజ్‌కుమార్, మర్రి రాజలింగం, దొంగల గౌరయ్య, యాదాండ్ల ఐలయ్య, గీసుకొండ, కొమ్మాల వెటర్నరీ డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సహ ఉద్యోగి కోరె అశోక్, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి సతీశ్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకుల రుద్రప్రసాద్, మంద రమేశ్, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్ష హోదాలో బీఆర్‌ఎస్ విఫలం'

నర్సంపేట : అసెంబ్లీ సమావేశాల్లో బలమైన, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా వ్యవహరించడంలో బీఆర్‌ఎస్ పార్టీ విఫలం అయ్యిందని ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అసెంబ్లీ సమావేశాల నుంచి బయటకు వచ్చి నిరసనలకు పిలుపునివ్వడాన్ని ఉటంకించారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాసమస్యల పరిష్కారాన్ని గాలికొదిలి రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నట్లు కనపడుతోందని తెలిపారు. ప్రతిపక్ష హోదాలో ప్రజాసమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని హితవు పలికారు. ప్రతిపక్ష హోదా వినియోగించుకోవడంలో నైపుణ్యత, చతురతను ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు ప్రజల పట్ల నిబద్ధత ఉండాలన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రజాసమస్యల ప్రస్తావనను విస్మరించారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ తీరుతో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, జన్ను రమేశ్, కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

'పాలకుల నిర్లక్ష్యంతోనే రైతుల ఆత్మహత్యలు'

దుగ్గొండి : పాలకుల నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో రైతుల, కౌలు రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నాచినపల్లికి చెందిన కౌలు రైతు దూడెల సారంగం ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని సంఘం బాధ్యులు గురువారం పరామర్శించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలోని కౌలు రైతులందరూ భూమిలేని పేదలేనని చెప్పారు. సొంత భూమి సైతం లేక కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఆశించిన మేరకు దిగుబడి రాకపోతే అప్పులకు వడ్డీలు సైతం చెల్లించలేని దుస్థితి ఉంటుందని తెలిపారు. కౌలు రైతుల బాధలు వర్ణనాతీతమని చెప్పారు. సారంగం కుటుంబ పోషణ కోసం భూమి కౌలుకు తీసుకుని రూ.10 లక్షల అప్పు పాలు కాగా తీర్చలేని దుస్థితిలో ఆత్మహత్య చేసుకోగా అతడి భార్య, ఇద్దరు పిల్లలకు ఆదరవు కరువైందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల పరిస్థితులను పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సారంగం కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ బాధ్యుడు అంశాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోహన్‌రావు, నాయకులు దామోదర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రాజేశ్వర్ రావు, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నిండాలి

నర్సంపేట : ఆటోడ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నిండాలని నవతెలంగాణ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ఆకాంక్షించారు. ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం వరంగల్ రోడ్డు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, యువరాజు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చి మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆందోళన వెలిబుచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రంలో 59 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వెలిబుచ్చారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని చెల్లించాలని, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మి నారాయణ, నవతెలంగాణ ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవృక్లపల్లి గణేశ్, కోశాధికారి పెండెం వెంకటేశ్వర్లు, కార్యదర్శులు పెండ్యాల నర్సయ్య, అంజపెల్లి రాజు, భగత్‌సింగ్, ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షుడు తేజావత్ సాయి, ఉపాధ్యక్షుడు గోనెల ప్రేమ్, కార్యదర్శి కాట శ్రీకాంత్, ఇన్‌చార్జి శివ, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఐఎన్‌టీయూసీ అనుబంధ, నర్సంపేట కాకతీయ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు కేక్ కట్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆటోడ్రైవర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

టీపీడీయూ పతాకావిష్కరణ

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో టీపీడీయూ పతాకాన్ని ఆ సంఘం రాష్ట్ర అడ్వయిజరీ బోర్డు మెంబర్ శానబోయిన రాజ్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల సలహాదారుడు మోడెం విద్యాసాగర్, నాయకులు ఎలగొండ నర్సింహ రాములు, కొడగాని బాబురావు, బండి శ్రీనివాస్, దేవేందర్, కుమారస్వామి, కృష్ణాకర్, గైని భాస్కర్, అడప సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలో స్థానిక ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు కంది కృష్ణారెడ్డి, అధ్యక్షుడు బండారి సత్యం కేక్ కట్ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, ఉప్పలయ్య, సాంబయ్య, భిక్షపతి, రాజేందర్, నర్సయ్య, కుమారస్వామి, స్వామి పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని సూరిపల్లి క్రాస్ రోడ్డులో చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డం రాజు ఆటో ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు మాధవులు, కోశాధికారి సురేష్, కార్యదర్శి సతీష్, ముఖ్యసలహాదారులు కవిరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ.. రైతుల చేతిలో హతం



నెక్కొండ : మండలంలో పనికర శివారు చంద్రుగొండ క్రాస్ రోడ్డు మీదకు వచ్చిన కొండ చిలువ రైతుల చేతిలో హతమైంది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డుపై కొండ చిలువ కనిపించడంతో రైతులు, పాదచారులు భయాందోళనకు గురై కర్రలతో కొట్టి చంపారు. మండలంలో గతంలో వరి కోత మిషన్‌లో పడి ఓ కొండ చిలువ మృతి చెందగా మరో కొండ చిలువను పాదచారులు చంపిన విషయం తెలిసిందే. పనికర గుట్టపై తల్లి కొండ చిలువ ఉండొచ్చని, దాని పిల్లలే రాత్రివేళల్లో రోడ్లపై ప్రత్యక్షం అవుతున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తల్లి కొండచిలువతోపాటు దాని పిల్లలను బంధించి అడవిలో సురక్షితంగా వదలాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లికి చెందిన మల్లయ్య పెంచుకుంటున్న గేదె ఆ గ్రామ శివారులో హనుమకొండ నుంచి నర్సంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు గురువారం ఢీకొనడంతో మృతి చెందింది. పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. గేదె మృతితో తనకు నష్టం వాటిల్లిన క్రమంలో బాధితుడిపై పోలీసులు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మల్లయ్య కోరాడు.

విద్యార్థులను 'రాష్ట్రస్థాయి'కి సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భాస్కర్

పర్వతగిరి : రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయిలో చేరుకునేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈఓ చదువుల సత్యనారాయణ, మండల నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పర్వతగిరి, ఏనుగల్, కొంకపాక స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ చదవడం, రాయడంలో ఉన్నతి సాధించడమే కాకుండా విద్యాప్రమాణాలు మెరుగుపడే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు, ఇతర రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పర్వతగిరి స్కూల్ హెచ్‌ఎం పాక రమేశ్ బాబు, కొంకపాక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం భిక్షపతి, ప్రసాద్, కిశోర్, శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల కేన్సర్‌పై అవగాహన ఉండాలి

నర్సంపేట రూరల్ : ఊపిరితిత్తుల కాన్సర్‌పై ప్రతీఒక్కరికీ అవగాహన అవసరమని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ (బిప్స్) ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, అధ్యాపకుడు నాగరాజు అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు ఆ సైన్స్ కళాశాలలో గురువారం ప్రపంచ ఊపిరితిత్తుల కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచంలో ఏటా సుమారు లక్ష మంది ఊపిరితిత్తుల వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నారని తెలిపారు. వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ పుట్ట రవి, విభాగాధిపతులు మనీశ్, రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

నర్సంపేట : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు వేర్వేరుగా పత్రిక ప్రకటనలు విడుదల చేశారు. అలుపెరగని పోరాడిన ఫలితంగానే సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.

ఘనంగా తీజ్



గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం తోపాటు పలు తండాల్లో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అవివాహిత యువతులు మొలకెత్తిన గోధుమ నారు బుట్టలతో పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, దూల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓగా భద్రయ్య



చెన్నారావుపేట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీహెచ్ ఓగా బాదావత్ భద్రయ్య గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సీహెచ్‌ఓ వెంకటేశ్వర్ రావు కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లగా ఖమ్మంలో విధులు నిర్వహించిన భద్రయ్య ఇక్కడకు బదిలీ అయ్యారు. మండలంలో స్టాఫ్‌నర్స్‌గా పని చేసిన స్వరూపరాణి బదిలీ కాగా ఎస్తేరు బ్యూలా, సూపర్‌వైజర్ కీర్యా ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సంక్షిప్త సమాచారం

'కొండా' అభిమానుల సందడి



గీసుకొండ : మండలంలోని రాంపురంలో కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అభిమానులు గురువారం సందడి చేశారు. కాంగ్రెస్ నాయకుడు, కొండా దంపతుల అభిమాని రడం భరత్ ఆహ్వానం మేరకు వారి నివాసానికి కొండా మురళీ చేరుకోగా ఆ పార్టీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కొండా మురళితో కరచాలనం చేయడానికి పోటీపడ్డారు. కొండాకు అనుకూలంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కొండా మురళీ వెంట నాయకులు గోపాల నవీన్‌రాజు, మంద బాబురావు, తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతకు పితృవియోగం



యాకయ్య (ఫైల్)

దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి యాకయ్య (80) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా గురువారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య దేవమ్మ, కుమారులు బాబు, వెంకటేశ్వర్లు, కూతురు అరుణ ఉన్నారు. యాకయ్య మృతితో విషాదం నెలకొంది.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పర్వతగిరి : రైతులకు లక్షన్నర రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండలంలోని మూడెత్తులతండాలో బంజారా సేవాలాల్ మండల అధ్యక్షుడు మూడు అంజినాయక్, రైతులు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడారు. ఎన్నికల హామీల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

మంద కృష్ణ చిత్రపటానికి...

నర్సంపేట : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్ దీప్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్దు మాట్లాడారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలో మంద కృష్ణ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల ప్రతాప్, మనుగొండ ప్రసాద్, బొట్ల నరేశ్, దయాకర్, సాంబయ్య, ఇంద్రసేన, సుధాకర్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

నర్సంపేట : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం తెలిపారు. ఒకటో వార్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుంచి కొల్లాపురం రాజేశ్ ఇంటి వరకు బురదమయమైన రోడ్డుకు ఆయన మరమ్మతులు చేయించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సన్మానం

నల్లబెల్లి : మండల కేంద్రంలోని పశు వైద్యశాల ఆస్పత్రి ఆవరణలో బదిలీ అయిన, బదిలీపై వచ్చిన ఉద్యోగులను ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. పశు వైద్యాధికారి శ్రీనాథ్, వెటర్నరీ అసిస్టెంట్ కృష్ణవేణి బదిలీ కాగా వారిని, బదిలీపై మండలానికి వచ్చిన సందర్భంగా పశు వైద్యాధికారి వేణును సన్మానించారు.